

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా రమేశ్


కొమ్మి రమేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా కొమ్మి రమేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్థానంలో పని చేసిన రవీంద్ర పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. రమేశ్ విజయవాడ సీఆర్‌డీఏ నుంచి ఇక్కడికి వచ్చారు.

తిరుపతికి బెర్తులా.. ఖాళీల్లేవు!



తిరుమల ఎక్స్‌ప్రెస్ నవంబరు 26 వరకూ ఫుల్



- మిగిలిన రోజువారీ, వారాంతపు రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు డిమాండ్
- ప్రస్తుతానికి ప్రత్యేక రైళ్లలోనే కాస్త అవకాశం
- విశాఖ నుంచి తిరుపతికి మరో రైలు నడపాలని ప్రయాణికుల డిమాండ్
- డబుల్ డెక్కర్ ఉన్నా ఆదరణ కరవు
- ప్రయాణ వేళలు అనుకూలంగా లేకపోవడం, 14 గంటలు కూర్చుని ప్రయాణించాల్సి ఉండడం కారణం

విశాఖపట్నం, సెప్టెంబరు 17:

తిరుపతి వెళ్లే రైళ్లలో బెర్తులు లభించడం గగనంగా మారింది. తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488), హౌరా-బెంగళూరు (12863), పూరి-తిరుపతి, బిలాస్‌పూర్-తిరుపతి, వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) వంటి రోజువారీ రైళ్లతోపాటు వారాంతపు, వారంలో రెండుసార్లు (బై వీక్లీ) నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటోంది. ప్రయాణికులు ముందస్తుగా యత్నించినా ఆశించిన తేదీల్లో బెర్తులు పొందలేని పరిస్థితులు నెలకొన్నాయి.

తిరుపతితోపాటు సమీప స్టేషన్లు రేణిగుంట, గూడూరు, నాయుడుపేట వెళ్లేందుకు రోజుకు దాదాపు 12 రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే విశాఖ నుంచి బయలుదేరే శాశ్వత రైళ్లు కేవలం రెండు (తిరుమల ఎక్స్‌ప్రెస్, డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్) మాత్రమే ఉన్నాయి. మిగిలిన రైళ్లన్నీ ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచేవి. దీంతో విశాఖ నుంచి తిరుపతి బయలుదేరే తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)కు డిమాండ్ అధికంగా ఉంటోంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి బయలుదేరే, తిరుపతి చేరే సమయం ప్రయాణికులకు అత్యంత అనుకూలంగా ఉండడంతో అత్యధికులు ఈ రైలుకు ప్రాధాన్యమిస్తుంటారు. డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆక్యుపెన్సీ అంతంత మాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖలో బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు), తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలు) అనుకూలంగా లేకపోవడం ఒక కారణమైతే...సుమారు 14 గంటలు కూర్చొని ప్రయాణించాల్సి రావడం మరో కారణం. అందుకే ప్రయాణికులు డబుల్ డెక్కర్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి రైల్వే అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక వారాంతపు రైలు అనుకూలంగా ఉన్నా కొద్దిమందికే ఉపయోగపడుతోంది. ప్రత్యేక రైలుకు అప్పటికప్పుడు వెళ్లాల్సిన ప్రయాణికులతో సాధారణ డిమాండ్ ఉంటోంది.

నవంబరు 26 వరకు బెర్తులు ఫుల్...

దసరా సెలవులతోపాటు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఉండడంతో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ప్రస్తుతం తీవ్ర డిమాండ్ ఏర్పడింది. నవంబరు 26 వరకూ బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతోపాటు స్లీపర్ క్లాస్ కోచ్‌లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది. అయితే అక్టోబరు 30, 31 తేదీల్లో మాత్రం ఏసీ కోచ్‌లలో కొన్ని బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

తిరుగు ప్రయాణ తిరుమల ఎక్స్‌ప్రెస్‌దీ అదే పరిస్థితి

తిరుపతి నుంచి విశాఖ చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చే ప్రయాణికులకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో (17487) బెర్తులు లభించే పరిస్థితి లేదు. అటు నుంచి వచ్చే తిరుమల ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో నిలిచిన పీఆర్‌పీ ట్రీట్‌మెంట్!

- జుట్టు రాలుడు సమస్యకు గతంలో చికిత్స
- నెలకు 60 మందికి చర్మవ్యాధుల విభాగం ఆధ్వర్యంలో సేవలు
- కరోనా సమయంలో బ్రేక్
- ఆ తరువాత పునఃప్రారంభించేందుకు చొరవ తీసుకోని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



'జుట్టు రాలిపోతోంది...' ప్రస్తుతం ఎక్కువ మంది నోట వినిపించే మాట. ఈ సమస్య యువతలో కూడా ఉంది. ఉపశమనం కోసం కొంతమంది వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. కేజీహెచ్‌లోని డెర్మటాలజీ విభాగంలో ఈ సమస్యకు గతంలో పరిష్కారాన్ని చూపేవారు. యుక్త వయసులోనే బట్టతల సమస్యతో బాధపడే వారికి అధునాతన చికిత్స అందించేవారు. అయితే కరోనా తరువాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో అత్యంత ఖరీదైన వైద్యం రోగులకు అందకుండా పోయింది.

పీఆర్‌పీ చికిత్సతో..

ప్లేట్ లెట్ రిచ్ ప్లాస్మా విధానంతో జుట్టు రాలిపోయిన చోట మళ్లీ వెంట్రుకలు వచ్చే అవకాశం ఉంది. జుట్టు రాలిపోతున్న వ్యక్తి శరీరం నుంచి రక్తాన్ని తీసి సెంట్రిఫ్యూజ్ అనే యంత్రంలో ప్లేట్ లెట్స్‌ను సెపరేట్ చేస్తారు. ఆ ప్లేట్‌లెట్స్‌ను జుట్టు రాలిపోయిన చోట ఇంజెక్ట్ చేస్తారు. ఈ విధంగా ఇంజెక్షన్ చేసిన ప్రదేశంలో కొన్నివారాల తరువాత నెమ్మదిగా వెంట్రుకలు మొలుస్తాయి. సమస్య తీవ్రతను బట్టి కొద్దిరోజుల వ్యవధిలో 10 నుంచి 20 వరకు ఇంజెక్షన్లు చేస్తారు. ఒకపక్క ఈ ఇంజెక్షన్స్ చేయించుకుంటూనే మరో పక్క వైద్యులు సూచించే కొన్నిరకాల మందులను వాడాల్సి ఉంటుంది. ఈ చికిత్సకు బయట అయితే భారీగా ఖర్చు అవుతుంది. కేజీహెచ్‌లో మాత్రం ఉచితంగా ప్రతినెలా 60 మందికి సేవలు అందించేవారు. కొన్ని (బ్లడ్, షుగర్, హార్మోన్స్, కొవ్వు శాతం, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్) రకాల పరీక్షలను నిర్వహించి, ఫలితం ఉంటుందని భావించిన వారికి మాత్రమే ఈ విధానంలో చికిత్స అందిస్తారు.

మళ్లీ ప్రారంభిస్తే మేలు

ఖరీదైన ఈ వైద్య సేవలను కేజీహెచ్‌లో తిరిగి ప్రారంభిస్తే ఎంతో మందికి మేలు కలుగుతుంది. బయట ఈ తరహా వైద్యానికి ... మిగతా 6వ పేజీలో

వంట నూనెలు సలసల

కిలోకు రూ.15 నుంచి రూ.20 పెంపు

- మార్కెట్‌లో ఫ్రీడమ్ ఆయిల్ రూ.130
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు



విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

వంట నూనెల ధరలు పెరిగాయి. సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ బ్రాండ్‌ను బట్టి సగటున కిలో రూ.110 నుంచి రూ.120 మధ్య విక్రయించేవారు. నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకం పెంచనున్నట్టు వెల్లడించింది. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ డీలర్లు, వ్యాపారులు మాత్రం దానిని సాకుగా తీసుకొని రేట్లు పెంచేశారు. లీటరుకు రూ.15 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు.

నగరంలో రిటైల్ వ్యాపారులు రెండు రోజులకు ఓసారి డీలర్ నుంచి స్టాకు తెప్పించుకుంటారు. రేట్లు పెరిగాయని, వాటి ప్రకారమైతే పంపిస్తామని డీలర్లు చెప్పడంతో రిటైలర్లు కొత్త రేట్ల ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా రేట్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతూ స్టాకిస్టులు వ్యాపారులు అడిగినంత సరకు ఇవ్వకుండా కొద్దికొద్దిగానే ఇస్తున్నారు. వినాయ చవితిని పురస్కరించుకుని రోజూ ప్రసాదాలు తయారీ, అన్నదానాలు పెద్దఎత్తున నిర్వహిస్తుండడంతో వంటనూనెల విక్రయాలు భారీగా సాగుతున్నాయి. దాంతో డీలర్ల పంట పండింది. కిలోకు అడ్డంగా రూ.15 నుంచి రూ.20 అదనంగా దోచుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. ప్రస్తుతం నగరంలోని రిటైలర్లు ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను లీటరు రూ.130 చొప్పున అమ్ముతున్నారు. సీతమ్మధార రైతుబజార్ సమీపాన ఉన్న సూపర్ మార్కెట్లలో లీటరు రూ.122 నుంచి రూ.124 వరకు అమ్ముతున్నారు.

ఎంఆర్‌పీ పేరుతో దోపిడీ

డీలర్లు, స్టాకిస్టులు గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) పేరుతో ప్రభుత్వాన్ని, కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. తనిఖీల సమయంలో దొరక్కుండా ఉండేందుకు ముందుగానే అధిక ధరలు ముద్రిస్తున్నారు. సాధారణ సమయాల్లో వాటిని రాయితీపై ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా అనధికారికంగా రేట్లు పెంచినప్పుడు ఎంఆర్‌పీకే ఇస్తున్నామని బుకాయిస్తున్నారు. ఇప్పుడు నగరంలో అమ్ముతున్న ఫ్రీడమ్ రిఫైన్డ్ ఆయిల్ ప్యాకెట్లపై ఎంఆర్‌పీ రూ.144 ముద్రించి ఉంది. అంటే తాము ఆ రేటుకే ఇస్తున్నామని, ఎక్కువ ధరకు అమ్మడం లేదని చెబుతున్నారు. కేసులు లేకుండా తప్పించుకోవడానికి ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు.

మొద్దునిద్రలో విజిలెన్స్

రాష్ట్రంలో వంట నూనెల ధరలు భారీగా పెంచేశారని ... మిగతా 6వ పేజీలో

వన్‌టౌన్‌లో హత్య

కార్పెంటర్‌ను నడిరోడ్డుపై పొడిచి చంపారు


హత్యకు గురైన భరణిక రాము(ఫైల్)

- పాతకక్షలే కారణమని పోలీసుల వెల్లడి

మహారాణిపేట/జగదాంబ కూడలి, సెప్టెంబరు 17:

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ఒకరిని కొందరు వెంటాడి కత్తులతో పొడిచి చంపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అఫీషియల్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జరిగిన ఈ దారుణ ఘటన నగరంలో సంచలనం రేపింది. ఇందుకు సంబంధించి వన్‌టౌన్ సీఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం...

రంగిరీజు వీధికి చెందిన భరణిక రాము(35)కార్పెంటర్. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. రాము గతంలో ఓ వివాదంలో మరో కార్పెంటర్ వేళంగిణిరావును తీవ్రంగా గాయపరచాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు తలెత్తాయి. ఇటీవల బార్‌లో గొడవ పడ్డారు. ఈ సంఘటనతో ఇరువురి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. మరోవైపు రాముకు బంధువులతోనూ విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోను రామును సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అతనికి వరసకు బావమరిది అయిన గరికిన సతీష్, అతని స్నేహితులు రాజేష్, మరికొందరు కలసి కత్తులతో పొడిచినట్టు సీఐ తెలిపారు. రోడ్డుపై రక్తస్రావంతో పడి ఉన్న రామును స్థానికులు కేజీహెచ్‌కు తరలించారన్నారు. అయితే ... మిగతా 6వ పేజీలో

సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభమెన్నడో?

- నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా కేటాయింపు
- నిరుపేదలకు ఉచితంగా ఖరీదైన పరీక్షలు నిర్వహించేందుకు మంజూరు


సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ కోసం విమ్స్‌లో నిర్మించిన భవనం

- విమ్స్‌లో రూ.కోట్ల వ్యయంతో భవన నిర్మాణం
- పరికరాలు సమకూరకపోవడంతో ఇంకా అందుబాటులోకి రాని సేవలు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభంపై స్పష్టత కొరవడింది. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులు రూ.21 కోట్లతో భవనాల నిర్మాణమైతే పూర్తిచేశారు. కానీ ఏడాది దాటుతున్నా ఇప్పటికీ ప్రారంభించలేదు. పరికరాలు కొనుగోలు ప్రక్రియ కూడా ఇంకా పూర్తికాలేదని చెబుతున్నారు.

ఉచితంగా ఖరీదైన పరీక్షలు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మూడు సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్లను మంజూరుచేసింది. ఇందులో ఒకటి విమ్స్‌లో, మరో రెండింటిని విజయవాడ, తిరుపతిల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్‌లో నిరుపేద రోగులకు ఉచితంగా అత్యంత ఖరీదైన సీటీ, ఎంఆర్‌ఐతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు నిర్ధారణకు అవసరమైన పరీక్షలను చేయ నున్నారు. ముఖ్యంగా కేన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణకు శాంపిల్స్‌ను ఇప్పటికీ ముంబై వంటి ప్రాంతాలకు పంపి స్తున్నారు. అటువంటి పరీక్షలను ఇక్కడే ఉచితంగా చేయ నున్నారు. ఈ సెంటర్ ఏర్పాటైతే ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, ఆర్థిక భారం తగ్గు తుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అంతటి, ముఖ్యమైన ఈ సెంటర్‌ను వీలైనంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా స్థానిక ప్రజా ప్రతినిధులు కృషిచేయాల్సి ఉంది.

కేజీహెచ్‌పై తగ్గనున్న ఒత్తిడి..

సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ అందుబాటులోకి వస్తే కేజీహెచ్‌పై ఒత్తిడి తగ్గనుంది. ప్రస్తుతం కేజీహెచ్‌లో మాత్రమే సీటీ, ఎంఆర్‌ఐ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. విమ్స్‌లో నామమాత్రపు ధరకు వీటితో పాటు రక్త పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కేజీహెచ్‌పై ఒత్తిడి తగ్గడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కేజీహెచ్‌లో ప్రతిరోజూ కనీసం వేయి నుంచి 1,500 మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. కనీసం 50 మందికి సీటీ, మరో పది మందికి ఉచితంగా ఎంఆర్‌ఐ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అదే సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రతిరోజూ కనీసం 500 మందికి సీటీ, మరో 200 మందికి ఎంఆర్‌ఐ, మరో వేయి మందికి రక్త పరీక్షలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.

మరో బిల్డింగ్ రీజనల్ డ్రగ్ స్టోర్..

సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆనుకునే మరో భవనాన్ని నిర్మిస్తున్నారు. సిటీ డయాగ్నోస్టిక్ భవన నిర్మాణ వ్యయం రూ.12 కోట్లు కాగా, మరో ... మిగతా 6వ పేజీలో

చేతులు మారిన పర్యాటక ప్రాజెక్టులు

సబ్ లీజుకు 'బే వాచ్' రిసార్ట్


తొట్లకొండలోని బే వాచ్ రిసార్ట్

- ఒకే సముదాయంలో నలుగురు కాంట్రాక్టర్లు!
- కాటేజీలు ఒకరికి, రెస్టారెంట్ మరొకరికి, మద్యం దుకాణం, ప్లే ఏరియా వేర్వేరుగా లీజుకు
- కళ్లు మూసుకున్న ఏపీటీడీసీ
- విచారణ ముగిసినా చర్యలకు మీనమేషాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) స్థిరాస్తుల లీజుల్లో అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తొట్లకొండలోని బే వాచ్ రిసార్ట్‌ను డీవీఎల్ఎన్ మూర్తి అనే వ్యక్తికి ఏపీటీడీసీ లీజుకు ఇచ్చింది. దానిని సబ్ లీజుకు ఇచ్చుకునేందుకు గానీ, అదనపు నిర్మాణాలు చేపట్టేందుకు గానీ లీజుదారుడికి హక్కు లేదు. అయితే నగరంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు ఒక బృందంగా ఏర్పడి ఆ లీజుదారుడి నుంచి బే వాచ్‌ను సబ్ లీజుకు తీసుకున్నారు. తమకు నచ్చినట్టు వ్యవహారాలు నడుపుతున్నారు. అక్కడ కేవలం రెస్టారెంట్, ప్లే ఏరియాను నిర్వహించాల్సి ఉండగా...అదనపు కాటేజీలు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. ఏపీటీడీసీ లైసెన్స్ పొందిన మద్యం దుకాణాన్ని వారే నిర్వహిస్తున్నారు. అయితే బే వాచ్‌ను వారు కూడా పూర్తిస్థాయిలో నడపకుండా వేర్వేరు వ్యక్తులకు సబ్ లీజుకు ఇస్తున్నారు. ఎవరు పెద్ద మొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తే వారికి వాటిని అప్పగిస్తున్నారు. ఈ క్రమంలో కాటేజీలు ఒకరికి, రెస్టారెంట్ మరొకరికి, మద్యం దుకాణం ఇంకొకరికి, ప్లే ఏరియా ఒకరికి లీజుకు ఇచ్చేసి భారీగా లబ్ధి పొందుతున్నారు. ఇంత పెద్దఎత్తున అక్కడ వ్యాపార వ్యవహారాలు సాగుతున్నా ఏపీటీడీసీకి నామమాత్రపు లీజు మొత్తమే అందుతోంది. మూడు నెలల క్రితం వరకు వైసీపీయే అధికారంలో ఉండడంతో ఆ నాయకుల బృందానికి అధికారులు ఎదురు చెప్పలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక దానిపై ఫిర్యాదులు అందడంతో జిల్లా పర్యాటక శాఖ అధికారిణితో కలెక్టర్ విచారణ చేయించారు. ఇది జరిగి వారం రోజులైంది. నివేదిక ఏమైందో, బే వాచ్‌పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఎవరూ వెల్లడించడం లేదు. తాజాగా విజయవాడ నుంచి విజిలెన్స్ బృందం కూడా వచ్చి విచారించి వెళ్లింది.

బొర్రాలో జిప్ లైన్‌పైనా విచారణ

అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు వద్ద కొన్నాళ్ల క్రితం పర్యాటకుల కోసం 'జిప్ లైన్' ... మిగతా 6వ పేజీలో

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్

» టెక్‌విసెస్ సంస్థ వ్యవస్థాపకుడు జెమ్స్ కాన్

మహారాణిపేట, సెప్టెంబరు 17: భారత్ ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని టెక్‌విసెస్ సంస్థ వ్యవస్థాపకుడు జెమ్స్ కాన్ అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌లో వ్యాపార అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా 50 ఔత్సాహిక కంపెనీలు తమ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. తమ సంస్థ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నామని, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. తమ సంస్థ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోందని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 17: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద 108 స్వర్ణ పుష్పాలతో అలంకరించి ఉభయదాతల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలను ఉభయదాతలకు అందజేశారు. ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు ఆలయం వద్ద సంప్రదించాల్సిందిగా ఈవో శ్రీనివాసులు రెడ్డి భక్తులకు తెలియజేశారు. నిత్యపూజలను అమ్మవారికి అర్చకులు నివేదించారు. అమ్మవారి దర్శనాలకు భక్తులు బారులు తీరారు.

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కంచరపాలెం, సెప్టెంబరు 17 జిల్లాలోని ప్రభుత్వ/ప్రయివేటు ఐటీఐల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి గాను నాలుగో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 26 సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు సమీపంలో గల ప్రభుత్వ/ప్రయివేటు ఐటీఐకి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోనివారిని మిగులు సీట్ల కౌన్సెలింగ్‌కు అనుమతించబోమన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈ నెల 27 వరకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు 28న, ప్రయివేటు ఐటీఐల్లో సీట్లకు 30న కౌన్సెలింగ్ ఉంటుందని తెలియజేశారు.

కార్మికులకు జీతం బకాయిలు చెల్లించాలి



మేయర్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఆనందరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 17: పీహెచ్ విభాగంలో అదనపు కార్మికులుగా సుమారు 300 మంది పనిచేస్తున్నారని, వీరికి సుమారు 10 నెలలుగా జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారికి జీవీఎంసీ ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు తెలియజేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సంబంధిత కార్మికులతో కలిసి సమస్యను ఆమెకు వివరించారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆమోదం తెలిపి జీతాలు చెల్లిస్తామని మేయర్ తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ కాంక్షిస్తూ ర్యాలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 17: నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల రసాయన విభాగంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ ప్రాధాన్యం తెలుపుతూ ప్లకార్డులతో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల హాల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవంపై సెమినార్‌లో విద్యార్థినులు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై ప్రాణవాయువు అందించే ఓజోన్ పరిరక్షణకు పాటించాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి, అనూష, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శరణ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణ పద్మ, డాక్టర్ కల్యాణరామ్, పీపీ కెమిస్ట్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

మాధవధారలో చిమ్మ చీకట్లు!



వాహనాల వెలుగులోనే రాకపోకలు

మాధవధార, సెప్టెంబరు 17; గ్రేటరు 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో రెండు వారాలుగా అంధకారం నెలకొంది. ఈ నెల మొదటి వారం నుంచి వానల ప్రభావంతో ఆగిన వీధి దీపాలు అనంతరం వెలగడం లేదు. మాధవధార ఉడా కాలనీ, అంబేడ్కర్ కాలనీ రోడ్డు, ఆర్టీఏ కార్యాలయం పరిసరాలు సహా 48ఏ, 48ఎస్ బస్సులు తిరిగే మెయిన్ రోడ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రి వేళ ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించి ఇళ్లకు చేరే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ట్యూషన్ సెంటర్ల నుంచి ఇళ్లకు చేరే విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. పలువురు స్థానికులు సచివాలయ సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా చీకట్లు తొలగడం లేదు. వాహనదారులు అతి సమీపానికి వచ్చే వరకు ఎదురుగావచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్



ఖాళీగా ఉన్న సీతమ్మధార రైతుబజార్ స్టాల్స్



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార, సెప్టెంబరు 17: నగరంలోని అతి పెద్ద రైతు బజార్లలో ఒక్కటైన సీతమ్మధారకు మంగళవారం రైతులు రాకపోవడంతో బజార్ అంతా బోసిపోయి కనిపించింది. గతంలో మంగళవారం రైతుబజార్ సెలవు ఉండేది. అయితే ఆ సెలవును రద్దు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ రైతులు తమకు సెలవు కావాలనుకునే వారంతా ఉండిపోయి పొలంలో పనులు చేసుకుంటూ ఉండిపోయారు. పూల వ్యాపారులు మాత్రం వచ్చి అమ్మకాలు చేశారు. దీంతో బజార్‌కి వచ్చిన కొంత మంది కొనుగోలుదారులు వెనుదిరిగారు. అయితే బజార్ సెలవు అనుకుని చాలా మంది ఉండిపోయారు. బజార్ మొత్తం మీద 150 స్టాల్స్ ఉండగా సెలవు లేని రోజుల్లో రైతులు 130 మందికి పైగా విచ్చేసి కాయగూరలు అమ్మేవారు. అయితే మంగళవారం మాత్రం సీతమ్మధార రైతుబజార్‌కి 15 మంది రైతులు మాత్రమే వచ్చారు. సాయంత్రం రైతులు రాలేదు.

నగరంలోని సీతమ్మధార రైతుబజార్ సెలవు రద్దు ప్రకటన, అభ్యంతరాల నేపథ్యంలో మంగళవారం రైతులు చాలా తక్కువ మంది వచ్చారు. మంగళవారం రైతుబజార్ సెలవు కావాలా? వద్దా? అనే అంశంపై మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ విచ్చేసి రైతులతో మాట్లాడారు. కొంత మంది తమకు సెలవు కావాలని, పొలానికి వెళ్లి పనిచేసుకుంటామని తెలిపారు. మరికొంత మంది రైతులు (బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి అమ్మకాలు చేసేవారు) తమకు సెలవు ఉన్నా, లేకపోయినా ఒక్కటే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత అందరి బాధ్యత: డీఆర్‌ఎం



ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 17: రైల్వే స్టేషన్, రైల్వే పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాల్తేరు రైల్వే డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. వాల్తేరు రైల్వేలో అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వచ్ఛ భారత్ అభియాన్‌ను డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ప్రారంభించారు. ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తూ, పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలన్నారు. బహిరంగ మల విసర్జన, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధమన్నారు. క్రమ పద్ధతిలో చెత్త పారివేయడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే స్వచ్ఛ భారత్ అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించి వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ అభియాన్ చేపట్టామని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ కమ్ హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ ప్రవీణ్ భాటి, డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ నరేంద్రకుమార్, బ్రాంచి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత్ మాజీ క్రికెటర్‌తో ఏసీఏ కార్యదర్శి భేటీ



విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 17: భారత్ మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్‌తో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు మంగళవారం భేటీ అయ్యారు. ఇక్కడి ఏసీఏ కార్యాలయంలో రాబిన్‌సింగ్‌తో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా యువ క్రికెటర్లు, మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ అంశాలపై చర్చించి పలు సూచనలు తీసుకున్నారు. అలాగే వివిధ వయసు వర్గాల క్రికెటర్లు అన్ని ఫార్మాట్లలో రాణించేందుకు అందించాల్సిన సదుపాయాలపై మాట్లాడారు. ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లాలో ఎస్సీ కమీషన్ సభ్యుడి పర్యటన

మహారాణిపేట, సెప్టెంబరు 17: జిల్లాలో బుధ, గురువారాల్లో జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రిజర్వేషన్‌లు అమలు, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై సమీక్షిస్తారు. స్టీల్‌ప్లాంట్, పోర్టు ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమవుతారు.

పారిశుధ్య సిబ్బందికి సత్కారం



జ్ఞానాపురం, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు అందించిన జీవీఎంసీ 32వ వార్డు సిబ్బందిని వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వార్డు పారిశుధ్య పర్యవేక్షకుడు కాశీరావు, మేస్త్రీ జి.కనకరాజు, భారతి, ఝాన్సీపై శంకర్లను అభినందించారు. కార్యక్రమంలో శాలివాహన, ఆదిబాబు,యాదగిరి శ్రీను, కందుల కేదార్నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ఘనంగా నివాళి



అక్కయ్యపాలెంలో విశ్వకర్మ, ప్రధాని నరేంద్ర మోదీల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 17: జిల్లా కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాస్తు శిల్పిగా పేరుగాంచిన విశ్వకర్మ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్‌వో మోహనకుమార్, అధికారులు శ్రీదేవి : అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగోవింద్ సింగ్, ఆచారి ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేన్యూకాలనీలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పృధ్వీరాజు, బీజేపీ సాలూరు ఇన్‌చార్జ్ ఎస్వీ ప్రకాష్‌రెడ్డి, రత్నం, పార్వతి, వెంకటరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'మహిళలపై నీచ రాతలను ఖండిస్తున్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

మహారాణిపేట, సెప్టెంబరు 17: సినీ నటి జెత్వానీకి జరిగిన అన్యాయంపై దేశ వ్యాప్తంగా మద్దతు తెలుపుతుంటే మాజీ సీఎం జగన్ రెడ్డి మాత్రం దోషులను కాపాడేందుకు సాక్షి పత్రికలో దిగజారుడు రాతలు రాయిస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జెత్వానీ కేసు సూత్రధారి జగన్‌రెడ్డే అని ఆరోపించారు. మహిళా అభ్యుదయం, సంక్షే మం, మహిళల భద్రత అంటూ గత ఐదేళ్ల ప్రచార ఆర్భాటాలు చేసిన జగన్ రెడ్డి తన సొంత పత్రికలో మహిళలను తీవ్రంగా అవమాన పరిచే లా వార్తలు రాయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. ఆయన సతీమణి భారతీ రెడ్డి ఆ పత్రికకు ఛైర్‌పర్సన్‌గా ఉండి సాటి మహిళను అవమానించటం సిగ్గుచేటన్నారు. నాయకురాళ్లు గనగళ్ల సత్యరామలక్ష్మి, శోభ, రాగిణి, వేణు, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు

మహారాణిపేట, సెప్టెంబరు17: జిల్లాలో సహజ తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, వాటికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరెట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి వనరుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చేపట్టిన సర్వేలో గుర్తించిన చెరువుల అభివృద్ధికి సంబంధించి వ్యయ అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు భవిష్యత్‌లో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని సూచించారు వనరుల సంరక్షణలో నివాసితులను, రైతులను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీఎమ్ఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జేసీ మయూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

అక్కయ్యపాలెం, కంచరపాలెం, సీతంపేట, సెప్టెంబరు 13: నులి పురుగులతో శారీరక ఎదుగుదల, మానసిక అభివృద్ధి తగ్గుతుందని, అందుకే పిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం 46వ వార్డు శాంతినగర్ లక్ష్మీనారాయణపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం తర్ఫీపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సుభాష్‌నగర్, కప్పరాడ, కె.మర్రిపాలెం, కరాస తదితర పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీతంపేట మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ శ్రావణి, ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, దేముడు బాబు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారులు సోమేశ్వర్రావు, దివాకర్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

'వెల్ఫేర్ ఆఫీసర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారు'

సీతమ్మధార, సెప్టెంబరు 17: సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం నెంబర్ 2 వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావును అన్యాయంగా సస్పెండ్ చేశారని, దీనిని నవయానం బహుజన సంక్షేమ సంఘం తరఫున ఖండిస్తున్నామని సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతమ్మధార వసతి గృహంలో రెండేళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఆర్.ప్రసాదరావును ఉత్తమ అధికారిగా అవార్డు ఇచ్చాయని, ఎన్నో ప్రశంసా పత్రాలు, ప్రభుత్వం నుంచి అందుకున్నారని, ఇవి ఆయన పనితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థులపట్ల నిజాయతీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ తనపై కుట్రపూరితంగా పథకం ప్రకారమే ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ యు.నాగరాజు, ఎన్.శ్రీనులు ఇలా చేశారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోవడమే ఇందుకు కారణమన్నారు.

వంట నూనెలు సలసల...

5వ పేజీ తరువాయి

గత మూడు రోజులుగా విస్తృత ప్రచారం జరగడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా అన్ని జిల్లాల్లో స్టాకిస్టులు, డీలర్లు, రిటైలర్లపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చాలా జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. విశాఖలో మాత్రం మంగళవారం రాత్రి 8 గంటల వరకు విజిలెన్స్ అధికారుల నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదు. కొన్ని పెద్ద వ్యాపార సంస్థలకు ముందుగా సమాచారం వెళ్లిందో ఏమో చిత్రాలయ ఎదురుగా ఉన్న పెద్ద వ్యాపార సంస్థలో లీటరు రూ.112కే బోర్డులు పెట్టి విక్రయించారు. వంట నూనెల ధరలు పెరగలేదని, గతంలో రేటుకు మాత్రమే విక్రయించాలని ప్రచారం చేయాల్సిన అధికారులు మౌనంగా ఉన్నారు.

కేజీహెచ్‌లో నిలిచిన పీఆర్‌పీ ట్రీట్‌మెంట్!

... 5వ పేజీ తరువాయి

వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ వైద్య సేవలను ప్రారంభించేందుకు అదనంగా అయ్యే ఖర్చు కూడా ఉండదని, సిబ్బందిని మాత్రమే ఇందు కోసం కేటాయించాల్సి ఉంటుందని అంటున్నారు. దీనిపై కేజీహెచ్ ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సిటీ డయాగ్నో సెంటర్ ప్రారంభమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

భవన నిర్మాణం వ్యయం రూ.9 కోట్లు. ఈ భవనాన్ని రీజనల్ డ్రగ్ స్టోర్‌గా వినియోగించ నున్నారు. ఈ రెండింటినీ ఒకేసారి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రీజనల్ డ్రగ్ స్టోర్‌లో మందులు నిల్వ చేయనున్నారు. ఆరు నెలలకు సరిపడా మందులు, ఇంజెక్షన్లు వంటివి నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడి నుంచే ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు మందులను పంపిణీ చేయనున్నారు. అయితే సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభించాలంటే అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలి. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

చేతులు మారిన పర్యాటక ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. దీని కోసం ఒక ప్రైవేటు సంస్థకు 2.3 ఎకరాలు కేటాయించారు. వాస్తవానికి గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు ఎటువంటి భూములు కేటాయించకూడదు. పైగా దీనికి స్థానిక గ్రామసభ ఆమోదం కూడా లేదు. కేవలం ట్రయల్ రన్ నిర్వహిస్తారని గిరిజనులను నమ్మించి జిప్ లైన్ ప్రారంభించారు. దాదాపు తొమ్మిది నెలలు నడిపారు. జిప్‌లైన్ ఎక్కడానికి టికెట్ ధర రూ.500 పెట్టారు. అలా దాని ద్వారా ఆ సంస్థకు రూ.2.59 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో ఏపీటీడీసీకి రూ.65 లక్షలు మాత్రమే చెల్లించారు. దానిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో మూసేశారు. తాజాగా దీనిపై కూడా అల్లూరి జిల్లా అధికారులు ఆ గ్రామానికి వెళ్లి మంగళవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ట్రయల్ రన్ పేరుతో తొమ్మిది నెలలు నడిపారని, ఇక వారికి ఇవ్వద్దని అంతా డిమాండ్ చేశారు. స్థానిక యువకులతోనే ఒక సంస్థను ఏర్పాటుచేసి, దాని నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించాలని కోరారు.

వన్‌టౌన్‌లో హత్య

... 5వ పేజీ తరువాయి

చికిత్స పొందుతూ మంగళవారం రాము మరణించినట్టు సీఐ పేర్కొన్నారు. పాత కక్షలతో అతడిని దారుణంగా కత్తులతో పొడిచి చంపినట్లు తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. హతుడు తల, మెడ, పొట్ట భాగంలో కత్తిపోట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేశామన్నారు. ఈ హత్య వెనుక ప్రమేయం ఉన్న వారెవ్వరినీ వదిలేది లేదని సీఐ భాస్కర్ పేర్కొన్నారు.

వ్యభిచార నిర్వహణ ముఠా అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 17: మహిళల అక్రమరవాణా, వ్యభిచారం నిర్వహిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ డా శంఖబ్రత బాగ్చి మంగళవారం తెలిపారు. వెబ్‌డిజైనర్ అయిన రావాడ కామరాజు దీపక్ పేరుతో ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను సృష్టించి ఏజెంట్ల వివరాలు, మహిళల ఫోటోలను అందజేస్తూ కస్టమర్లు, ఏజెంట్లకు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు దాడి చేసి లాసెన్స్ బే కాలనీలోని ఒక ఇంటిలో ఉంటున్న కామరాజును అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఉన్న సహచరులు బాడ రాము, మాటూరు రమేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం వారి ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో జరిపిన విచారణలో మహిళలను ఈ ఊబిలోకి లాగేందుకు ఉపయోగించుకున్న 34 మంది ఏజెంట్ల పేర్లు వెల్లడించారు. వారు ఇచ్చిన సమాచారంతో ముగ్గురు బాధితులను రక్షించి ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తిరుపతికి బెర్తులా.. ఖాళీల్లేవు!

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌కు (17487) కూడా నవంబరు నెలాఖరు వరకు దాదాపు బెర్తులు నిండిపోయాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు నవంబరు 24 వరకు ఫుల్

విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (22879) నవంబరు 23 వరకు, ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైళ్లకు నవంబరు 30, 31 తేదీల నుంచి బెర్తులు ఖాళీ ఉన్నాయి.

ప్రత్యేక రైలుకు అందుబాటులో బెర్తులు

ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతి వెళ్లే ప్రత్యేక రైలు (08583)లో బెర్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు అక్టోబరు నెలలో కూడా ప్రతి సోమవారం బెర్తులు ఉన్నాయి. తిరుమల ఎక్స్‌ప్రెస్, ఇతర రైళ్లలో బెర్తులు లభించని వారు ప్రత్యేక రైళ్లను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది.

రోజువారీ, వారాంతపు రైళ్లకు డిమాండ్

ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచే రోజువారీ, వారాంతపు రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు డిమాండ్ ఉంది. హౌరా-బెంగళూరు రోజువారీ ఎక్స్‌ప్రెస్ (12863)కు నవంబరు 21 వరకు కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ మినహా బెర్తులు నిండిపోయాయి. పూరీ-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), సంత్రాగచ్చి-మంగుళూరు (22851), హటియా-బెంగళూరు (12835), వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504), అంగా ఎక్స్‌ప్రెస్ (12254), గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) వంటి రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకూ డిమాండ్ నెలకొంది.

విశాఖ-తిరుపతి మధ్య మరో రైలుకు డిమాండ్

విశాఖ-తిరుపతి మధ్య ప్రతిరోజు నడిచేలా శాశ్వత ప్రాతిపదికన మరో రైలు ప్రవేశపెట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే అధికారులు దానిపై దృష్టి పెడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన రోజువారీ సర్వీసుల రూపంలో కొత్త రైలు ప్రవేశపెట్టాలని, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మృత్యు రహదారి..

» ప్రమాదాలకు నిలయంగా మారిన వేపగుంట-పినగాడి మార్గం

» ఇప్పటికే రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది మృత్యువాత...పదుల సంఖ్యలో క్షతగాత్రులు

» నాబార్డు నిధులు రూ.కోటి మంజూరైనా ముందుకు సాగని రహదారి పునర్నిర్మాణ పనులు

» ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశాలు బేఖాతరు


గోతులమయంగా మారిన వేపగుంట-పినగాడి రోడ్డు


ఛిద్రంగా ఉన్న రహదారి

పెందుర్తి, సెప్టెంబరు 17: భారీ గోతులతో అధ్వాన స్థితికి చేరిన వేపగుంట నుంచి పినగాడి రహదారి ఎంతోమంది ప్రాణాలను బలిగొంటోంది. గతంలో ఈ మార్గంలో గుంతల్లో బైక్ పడి గోపాలపట్నానికి చెందిన ఓ నవ వధువు మృత్యువాత పడింది. అలాగే ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి తనువు చాలించాడు. కేటరింగ్ పనులు చేస్తూ కుటుంబానికి పోషిస్తున్న ఆచారి అనే వ్యక్తిని ఈ మార్గంలోని గోతులే కబళించాయి... ఇలా ఎంతోమంది ప్రాణాలను గోతులు పొట్టన బెట్టుకుంటున్నా అధికారులు, పాలకుల్లో మాత్రం చలనం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేపగుంట-పినగాడికి చెందిన ఆరు కిలోమీటర్ల మార్గంలో గజానికో గొయ్యి ఉండడంతో పాటు ఎక్కడికక్కడ రాళ్లుతేలి ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి చెరువును తలపించింది.

ఈ మార్గం గుండా వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నగరం నుంచి వేపగుంట మీదగా చీమలాపల్లి చేరుకుని.. ఇక్కడ నుంచి పినగాడి జంక్షన్ మీదగా చోడవరం, అనకాపల్లి వెళ్లేందుకు ఇది దగ్గర రహదారి. 20 గ్రామాలకు అనుసంధానంగా ఈ మార్గం ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ మార్గమంతా గోతులమయంగా.. రాళ్లుతేలి ఉన్నందున ప్రయాణం ప్రాణాంతకంగా మారిందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి గత ఏడాది నాబార్డు నిధులు రూ.కోటి మంజూరవ్వడంతో అప్పటి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే కాంట్రాక్టర్ రహదారి పక్కన మెటీరియల్ డంప్ చేసి పనులను మధ్యలోనే వదిలేశారు. బిల్లు చెల్లింపులు జరగనందునే ఆయన వెనకడుగు వేసినట్టు తెలిసింది. కాగా ఇప్పటివరకు ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఆఖరికి స్థానికులు రహదారిలోని గుంతలు పూడ్చుతున్నా.. అవి కొద్దిరోజులకే యథాస్థితికి చేరుకుంటున్నాయి. ఇటీవల వర్షాలకు ఈ రోడ్డు మరింత దారుణంగా తయారైంది.

ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశాలు బేఖాతరు

పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబు జూన్ 27న వేపగుంట-చీమలాపల్లి రహదారిని అధికారులతో కలిసి పరిశీలించారు. గోతులతో నిండిన ఈ రోడ్డు నిర్మాణ పనులను వారం రోజుల్లోగా ప్రారంభించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ రెండున్నర నెలలైనా ఎమ్మెల్యే ఆదేశాలు మాత్రం అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. జీవీఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే ఈ దుస్థితి నెలకొన్నట్టు తెలిసింది. ఇటీవల జరిగిన మండల సమావేశంలోనూ ఎమ్మెల్యే పంచకర్ల ఈ విషయంపై అధికారులను నిలదీసినా ఫలితం కానరాలేదు.


చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేస్తున్న జీఎం దాస్, తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఉక్కు జీఎం దాస్

అగనంపూడి, సెప్టెంబరు 17: ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం, వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ పారవేయరాదని స్టీల్ అడ్మిన్ విభాగం జీఎం ఎస్‌బీ దాస్ కోరారు. స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అగనంపూడి కూడలి నుంచి ఉక్కునగరం వెళ్లే రహదారిలోని చెక్ పోస్ట్ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్లాంట్ పరిసరాల్లో 15 రోజుల పాటు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం ఆయనతో పాటు పలువురు చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేసి చెత్త, వ్యర్థాలను వాహనాల్లోకి ఎత్తారు. కార్యక్రమంలో ఉక్కు అధికారులు సింహాద్రి, వరప్రసాద్, రామచంద్రరావు, సుబ్బరాజు, బంగార్రాజు, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు పరిసరాల్లో స్వచ్ఛతాహి..

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం రైతు బజారు పరిసరాల్లో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు బజారు పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. తొలుత ఎయిర్‌పోర్టు అథారిటీ కార్యాలయంలో సిబ్బంది అంతా పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడతామని ప్రతిజ్ఞ చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఎన్.ఎ.డీ.జంక్షన్, సెప్టెంబరు 17: ఎన్ఏడీ సమీపంలోని సాకేతపురంలో మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ యువతను అధిక సఖ్యలో పార్టీలో చేర్చి వారిని దేశ సేవకు సిద్ధమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌వర్మ, రామ్మోహన్, సంతోశ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు

వేపగుంట, సెప్టెంబరు 17: సింహపురికాలనీలో ఉన్న గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఆదేశాల మేరకు ప్రత్యేక పోడియంను తొలగించారు. ఇక్కడ ఎత్తుగా ఉన్న పోడయంను తొలగించి ప్రజలందరికీ సేవలందించేందుకు చర్యలు చేపట్టామని గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ పీఎస్ మాధవి పేర్కొన్నారు.

88వ వార్డులో బోరింగులు ప్రారంభం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 17: జీవీఎంసీ 88వ వార్డు పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మంగళవారం కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నూతన బోరింగులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు గాను ఈ బోరింగులను ఏర్పాటు చేశామన్నారు. ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎం.రాము, ఉరుకూటి శ్రీను, ఎర్నిబాబు, ఒమ్మి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

అగనంపూడి, సెప్టెంబరు 17: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొండయ్యవలస అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు టీడీపీ నాయకుడు బలిరెడ్డి సత్యనారాయణ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. టీడీపీ నాయకుడు బి.చందు రమేశ్, ఉపాధ్యాయుడు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: వడ్లపూడి పాఠశాలలోని విద్యార్థులకు 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, కణితి పీహెచ్‌సీ డాక్టర్ శివయ్య, ఎంఈవో సునీత ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నివారించవచ్చని వారు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 32, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 74, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

'మేహాద్రిగెడ్డ' కాలువ పూడ్చివేసి రోడ్డు నిర్మాణం

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశాల మేరకు తొలగించడానికి వచ్చిన జీవీఎంసీ సిబ్బందిని అడ్డుకున్న స్థానికులు

» చేసేది లేక వెనుతిరిగిన సిబ్బంది


గవర జగ్గయ్యపాలెంలో మేహాద్రిగెడ్డ కాలువను పూడ్చివేసి నిర్మించిన రహదారి

గోపాలపట్నం, సెప్టెంబరు 17: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి విడుదల చేసేటప్పుడు నీరు ప్రవహించే కాలువను పూడ్చివేసి నిర్మించిన రహదారిని తొలగించడానికి వచ్చిన జీవీఎంసీ సిబ్బందిని పలువురు అడ్డగించడంతో గవర జగ్గయ్యపాలెం గ్రామంలో మంగళవారం వివాదం చోటుచేసుకుంది. మేహాద్రిగెడ్డ జలాశాయం నుంచి వరద నీరు ప్రవహించే కాలువ కోటనరవ, గవర జగ్గయ్యపాలెం, షీలానగర్ మీదుగా డాక్‌యార్డు వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే గవర జగ్గయ్యపాలెం వద్ద ఈ కాలువను ఆనుకుని గ్రామస్థుల భూములతో పాటు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్థలాలు కూడా ఉన్నాయి. దీంతో ఈ భూముల్లోకి రాకపోకలు సాగించడానికి వీలుగా గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నాయకుల చొరవతో కాలువను నిర్మాణ వ్యర్థాలతో నింపి రహదారిని నిర్మించారు. అయితే చాలాకాలంగా రిజర్వాయర్ గేట్లు ఎత్తక పోవడంతో కాలువలో నీరు ప్రవహించక ఎటువంటి ముంపు సంభవించలేదు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండిపోవడంతో ముంపు సంభవించే ప్రమాదం ఉండడంతో కొందరు గ్రామస్థులు రిజర్వాయర్ కాలువను మూసివేసిన విషయాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారం రోజుల క్రితం ఆయన లోతట్టు ప్రాంతాల్లో ముంపు ప్రమాదం లేకుండా కాలువల్లో పూడికలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రిజర్వాయర్ కాలువకు అడ్డంగా నిర్మించిన రహదారిని తొలగించడానికి జీవీఎంసీ సిబ్బంది మంగళవారం గవర జగ్గయ్యపాలెం వచ్చారు. అయితే కొందరు స్థానికులు కాలువపై నిర్మించిన రహదారిని తవ్వడానికి అడ్డుచెప్పడంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో చేసేది లేక జీవీఎంసీ సిబ్బంది వెనుదిరిగారు.

ఆ రహదారిని తొలగించకపోతే ముంపే..

మేహాద్రిగెడ్డ కాలువపై నిర్మించిన అనధికార రహదారిని తొలగించకపోతే వరద నీటితో ఈ ప్రాంతానికి ముంపు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉంది. అయితే దీనిపై ఎమ్మెల్యే స్పందించినా పలువురు తొలగింపు పనులను అడ్డుకోవడం పట్ల గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


పల్లా శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న కేవీఎస్ శంకరరావు, తదితరులు

వరద బాధితులకు అండగా నిలవాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, సెప్టెంబరు 17: వరద బాధితులకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ 70వ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావుతో పాటు ఆయన మిత్ర బృందం వరద బాధితుల సహాయార్థం రెండు లక్షల రూపాయల చెక్కును పల్లా శ్రీనివాసరావుకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ మానవతా దృక్పథంతో వరద బాధితులకు అండగా నిలుస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలపడంతో పాటు రెండు లక్షల చెక్కును అందజేసిన టీడీపీ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పి.సత్యన్నారాయణ మూర్తి, కె.శ్రీనివాసరావు, ప్రసాద్, పిబిఎల్ మూర్తి, ఎంఎస్ఎన్ రాజు, సూరిబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనాలపైకి దూసుకు వచ్చిన మినీ వ్యాన్

ఇద్దరికి గాయాలు, ఓ ద్విచక్ర వాహనం ధ్వంసం

మద్యం తాగివున్న వ్యాన్ డ్రైవరును అదుపులోకి తీసుకున్న పోలీసులు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిన వ్యాన్... పక్కన ధ్వంసమైన బైక్

గోపాలపట్నం, సెప్టెంబరు 17: అదుపు తప్పిన మినీ వ్యాన్ జనాలపైకి దూసుకువచ్చిన ఘటనలో ఇద్దరికి గాయాలవ్వడంతో పాటు ఓ ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో చంద్రనగర్ నుంచి ఎల్లపువానిపాలెం వైపు వస్తున్న ఓ మినీ వ్యాన్ అదుపు తప్పి ఎల్లపువానిపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద జనాలపైకి దూసుకువచ్చింది. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాల తొక్కుకుంటూ సమీపంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొని ఆగింది. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు స్థానికులు భయాందోళనతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకపోయినా, ఓ మహిళకు, ఒక ద్విచక్ర వాహనదారునికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు కారణమైన మినీ వ్యాన్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మినీ వ్యాన్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తలు అరెస్టు: 2 కార్లు స్వాధీనం


విలేకరుల సమావేశంలో డీసీపీ తుహిన్ సిన్హా, సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 17: కారుకు నెలనెలా అద్దె చెల్లిస్తామని మాయమాటలు చెప్పి, మోసాలకు పాల్పడుతున్న భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు వారి వద్ద నుంచి రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తుహిన్ సిన్హా తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలేనికి చెందిన ఫార్మా ఉద్యోగి బుద్దా వీరమణికంఠ వద్దతో పాటు కంచరపాలెం, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువిరి వద్ద కార్లను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టి భార్యాభర్తలు మోసాలకు పాల్పడ్డారన్నారు. వీరమణికంఠ ఈ నెల 14న దువ్వాడ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి భార్యాభర్తలైన రవీంద్ర, రూపాశ్రీలను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారం రోజుల్లో మరో రెండు కార్లను స్వాధీనం చేసుకుంటామని డీసీపీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సభ్యులు సమృద్ధి సాధించాలి

పెందుర్తి, సెప్టెంబరు 17: స్వయం సహాయక సభ్యులు స్వయం సమృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి అన్నారు. పెందుర్తిలోని జిల్లా మహిళా సమాఖ్య కేంద్రంలో మంగళవారం మండలి మహిళా సమాఖ్య సమావేశంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల సమాఖ్య పరిధిలో గల 849 మంది పొదుపు సంఘాల్లో గల తొమ్మిది వేల మంది సభ్యులు స్వచ్ఛతాహి సేవా ఉద్దేశాన్ని ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. అనంతరం సంఘ సభ్యులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ చేపట్టారు. మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛతా విధానాలపై నినాదాలు చేశారు. అంతకుముందు సంఘ సభ్యులకు కూరగాయల విత్తనాల కిట్లను అందజేశారు. డీఎల్‌డీవో పూర్ణి మాదేవి, ఏపీడీ రమణ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గణబాబును కలిసిన హెచ్‌పీసీఎల్ ఈడీ

గోపాలపట్నం, సెప్టెంబరు 17: హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణన్ రమానాథన్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణబాబును హెచ్‌పీసీఎల్ అధికారులు దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. గణబాబును కలిసిన వారిలో హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ జీఎం కిరణ్, పీఆర్వో కాళీ, తదితరులు ఉన్నారు.


విశ్వకర్మ జయంతి సందర్భంగా పూజల్లో పాల్గొన్న ఉక్కు డైరెక్టర్లు, తదితరులు


భెల్ హెచ్‌పీవీపీలో జరిగిన కార్యక్రమంలో ఈడీ జితేందర్‌రెడ్డి, తదితరులు

వైభవంగా విశ్వకర్మ జయంతి

ఉక్కు టౌన్‌షిప్, సెప్టెంబరు 17: ఉక్కు కర్మాగారంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలను మంగళవారం ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్), డైరెక్టర్ (ఫైనాన్స్) ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఐఎన్ఎల్‌కు త్వరలోనే పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ గాంధీ, డాక్టర్ సారంగి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, రామ్మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా విశ్వకర్మ విగ్రహం వద్ద వైభవంగా పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: భెల్ హెచ్‌పీవీపీలో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త అరసవల్లి సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భెల్ హెచ్‌పీవీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో పాటు అధికారుల్లు గౌరీశంకర్, పట్నాయక్, జి.చంద్రశేఖర్, కార్మిక నాయకులు కొల్లి దేముడు, ఎస్.సాహు, వీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. పెదగంట్యాడ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను చేపట్టారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశ్వకర్మ సర్వజనాలకు ఆహార ప్రదాతగా వేదాల్లో పేర్కొనడం జరిగిందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్మిక నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, జి.ప్రభాకరరెడ్డి, డి.అప్పారావు, యెల్లేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని 87వ వార్డు పరిధి వడ్లపూడిలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆయలంలో కార్పొరేటర్ బొండా జగన్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేపగుంట: జీవీఎంసీ 93, 94వ వార్డుల్లో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా నాయుడుతోట బంటాకాలనీలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. విశ్వకర్మ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సాయిమాధవ నగర్, వేపగుంట కూడలిలో ప్రత్యేకంగా విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, సెప్టెంబరు 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన రక్తదాన, వైద్య శిబిరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధికి పీఎం మోదీ ఎంతో చేస్తున్నారని కొనియాడారు. పీఎం జన్మదినం సందర్భంగా దాతలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీశ్, శంకరరావు, శ్రీనివాస్, కృష్ణంరాజు, యువశ్రీ, రోహిణి, శశిధరన్, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో పీఎం మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మోదీ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కె.గురుమూర్తి, జి.సతీశ్, మాజీ సైనికుడు సత్యనారాయణ, సత్యారావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కూటమి నాయకులు స్థానికంగా భారీ కేక్ కట్ చేయడంతో పాటు ఏరియా ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలను సూపరింటెండెంట్ డాక్టర్ భారతి చేతుల మీదగా పంపిణీ చేశారు. నాయకులు కర్రి దేశేంద్ర, వి.వసంతరావు, బి.సత్యనారాయణ, ఎస్. సింహాచలం, తాతారావు, చందు రమేశ్, రాజు, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 70వ వార్డు ఎల్‌వీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి పాలు, రొట్టెలను పార్టీ మండల అధ్యక్షుడు దేనంకొండ పావని కృష్ణంరాజు పంపిణీ చేశారు. తొలుత కేక్ కట్ చేశారు. అలాగే 86వ వార్డు అధ్యక్షురాలు బొండా శ్రీదేవి, ఎల్లాజీరావు ఆధ్వర్యంలో, ఏపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి నేతృత్వంలో, 87వ వార్డులో నాయకుడు లక్కరాజు సోంబాబు ఆధ్వర్యంలో మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రామాలయంలో పూజలు చేశారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

వేపగుంట, సెప్టెంబరు 17: గ్రేటర్ 94వ వార్డు కృష్ణరాయపురం సమీపంలోని సేనాతివానిపాలెంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కేఆర్‌పీ సీజన్-3 మినీ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పది జట్లు పాల్గొనగా విజేతగా కేఆర్‌పీ కింగ్స్ విజేతగా, రన్నరప్‌గా కేఆర్‌పీ టైటాన్స్ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శివాజీ నిలిచారు. విజేతలకు మంగళవారం టీడీపీ నాయకుడు బొబ్బర నరసింహనాయుడు బహుమతులు అందజేశారు.


ట్రోఫీలతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలు

విధులు బహిష్కరించిన పారిశుధ్య కార్మికులు

గాజువాక, సెప్టెంబరు 17: సకాలంలో జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ తడి, పొడి చెత్త సేకరణ చేసే పారిశుధ్య కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి క్లాప్ ఆటోయార్డు వద్ద ఆందోళనకు దిగారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణ తమకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టరుకు జీతాలను ప్రతినెలా చెల్లించాలని ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టి వెట్టిచాకిరి చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. కాగా ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్ కార్మికుల వద్దకు వచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కార్మికులు గొలగాని అప్పారావు, అనీల్, సుధీర్, లక్ష్మి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్

» టెక్‌విసెస్ సంస్థ వ్యవస్థాపకుడు జెమ్స్ కాన్

మహారాణిపేట, సెప్టెంబరు 17: భారత్ ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని టెక్‌విసెస్ సంస్థ వ్యవస్థాపకుడు జెమ్స్ కాన్ అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌లో వ్యాపార అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా 50 ఔత్సాహిక కంపెనీలు తమ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. తమ సంస్థ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నామని, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. తమ సంస్థ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోందని పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 17: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద 108 స్వర్ణ పుష్పాలతో అలంకరించి ఉభయదాతల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలను ఉభయదాతలకు అందజేశారు. ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు ఆలయం వద్ద సంప్రదించాల్సిందిగా ఈవో శ్రీనివాసులు రెడ్డి భక్తులకు తెలియజేశారు. నిత్యపూజలను అమ్మవారికి అర్చకులు నివేదించారు. అమ్మవారి దర్శనాలకు భక్తులు బారులు తీరారు.

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కంచరపాలెం, సెప్టెంబరు 17 జిల్లాలోని ప్రభుత్వ/ప్రయివేటు ఐటీఐల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి గాను నాలుగో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 26 సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు సమీపంలో గల ప్రభుత్వ/ప్రయివేటు ఐటీఐకి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోనివారిని మిగుల సీట్ల కౌన్సెలింగ్‌కు అనుమతించబోమన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈ నెల 27 వరకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు 28న, ప్రయివేటు ఐటీఐల్లో సీట్లకు 30న కౌన్సెలింగ్ ఉంటుందని తెలియజేశారు.

కార్మికులకు జీతం బకాయిలు చెల్లించాలి



మేయర్‌కు సమస్యలు తెలియజేస్తున్న ఆనందరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 17: పీహెచ్ విభాగంలో అదనపు కార్మికులుగా సుమారు 300 మంది పనిచేస్తున్నారని, వీరికి సుమారు 10 నెలలుగా జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారికి జీవీఎంసీ ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు తెలియజేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సంబంధిత కార్మికులతో కలిసి సమస్యను ఆమెకు వివరించారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆమోదం తెలిపి జీతాలు చెల్లిస్తామని మేయర్ తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ కాంక్షిస్తూ ర్యాలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 17: నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల రసాయన విభాగంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ ప్రాధాన్యం తెలుపుతూ ప్లకార్డులతో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల హాల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవంపై సెమినార్‌లో విద్యార్థినులు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై ప్రాణవాయువు అందించే ఓజోన్ పరిరక్షణకు పాటించాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి, అనూష, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శరణ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణ పద్మ, డాక్టర్ కల్యాణరామ్, పీపీ కెమిస్ట్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

మాధవధారలో చిమ్మ చీకట్లు!



వాహనాల వెలుగులోనే రాకపోకలు

మాధవధార, సెప్టెంబరు 17; గ్రేటరు 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో రెండు వారాలుగా అంధకారం నెలకొంది. ఈ నెల మొదటి వారం నుంచి వానల ప్రభావంతో ఆగిన వీధి దీపాలు అనంతరం వెలగడం లేదు. మాధవధార ఉడా కాలనీ, అంబేడ్కర్ కాలనీ రోడ్డు, ఆర్టీఏ కార్యాలయం పరిసరాలు సహా 48ఎ, 48ఎస్ బస్సులు తిరిగే మెయిన్ రోడ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రి వేళ ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించి ఇళ్లకు చేరే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ట్యూషన్ సెంటర్ల నుంచి ఇళ్లకు చేరే విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. పలువురు స్థానికులు సచివాలయ సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా చీకట్లు తొలగడం లేదు. వాహనదారులు అతి సమీపానికి వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్



ఖాళీగా ఉన్న సీతమ్మధార రైతుబజార్ స్టాల్స్



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార, సెప్టెంబరు 17: నగరంలోని అతి పెద్ద రైతు బజార్లలో ఒక్కటైన సీతమ్మధారకు మంగళవారం రైతులు రాకపోవడంతో బజార్ అంతా బోసిపోయి కనిపించింది. గతంలో మంగళవారం రైతుబజార్ సెలవు ఉండేది. అయితే ఆ సెలవును రద్దు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ రైతులు తమకు సెలవు కావాలనుకునే వారంతా ఉండిపోయి పొలంలో పనులు చేసుకుంటూ ఉండిపోయారు. పూల వ్యాపారులు మాత్రం వచ్చి అమ్మకాలు చేశారు. దీంతో బజార్‌కి వచ్చిన కొంత మంది కొనుగోలుదారులు వెనుదిరిగారు. అయితే బజార్ సెలవు అనుకుని చాలా మంది ఉండిపోయారు. బజార్ మొత్తం మీద 150 స్టాల్స్ ఉండగా సెలవు లేని రోజుల్లో రైతులు 130 మందికి పైగా విచ్చేసి కాయగూరలు అమ్మేవారు. అయితే మంగళవారం మాత్రం సీతమ్మధార రైతుబజార్‌కి 15 మంది రైతులు మాత్రమే వచ్చారు. సాయంత్రం రైతులు రాలేదు.

నగరంలోని సీతమ్మధార రైతుబజార్ సెలవు రద్దు ప్రకటన, అభ్యంతరాల నేపథ్యంలో మంగళవారం రైతులు చాలా తక్కువ మంది వచ్చారు. మంగళవారం రైతుబజార్ సెలవు కావాలా? వద్దా? అనే అంశంపై మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ విచ్చేసి రైతులతో మాట్లాడారు. కొంత మంది తమకు సెలవు కావాలని, పొలానికి వెళ్లి పనిచేసుకుంటామని తెలిపారు. మరికొంత మంది రైతులు (బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి అమ్మకాలు చేసేవారు) తమకు సెలవు ఉన్నా, లేకపోయినా ఒక్కటే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత అందరి బాధ్యత: డీఆర్ఎం



ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 17: రైల్వే స్టేషన్, రైల్వే పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాల్తేరు రైల్వే డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. వాల్తేరు రైల్వేలో అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వచ్ఛ భారత్ అభియాన్‌ను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ప్రారంభించారు. ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తూ, పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలన్నారు. బహిరంగ మల విసర్జన, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధమన్నారు. క్రమ పద్ధతిలో చెత్త పారివేయడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే స్వచ్ఛ భారత్ అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించి వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ అభియాన్ చేపట్టామని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ కమ్ హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ ప్రవీణ్ భాటి, డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ నరేంద్రకుమార్, బ్రాంచి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత్ మాజీ క్రికెటర్‌తో ఏసీఏ కార్యదర్శి భేటీ



విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 17: భారత్ మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్‌తో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు మంగళవారం భేటీ అయ్యారు. ఇక్కడి ఏసీఏ కార్యాలయంలో రాబిన్‌సింగ్‌తో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా యువ క్రికెటర్లు, మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ అంశాలపై చర్చించి పలు సూచనలు తీసుకున్నారు. అలాగే వివిధ వయసు వర్గాల క్రికెటర్లు అన్ని ఫార్మాట్లలో రాణించేందుకు అందించాల్సిన సదుపాయాలపై మాట్లాడారు. ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లాలో ఎస్సీ కమీషన్ సభ్యుడి పర్యటన

మహారాణిపేట, సెప్టెంబరు 17: జిల్లాలో బుధ, గురువారాల్లో జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రిజర్వేషన్‌లు అమలు, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై సమీక్షిస్తారు. స్టీల్‌ప్లాంట్, పోర్టు ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమవుతారు.

పారిశుధ్య సిబ్బందికి సత్కారం



జ్ఞానాపురం, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు అందించిన జీవీఎంసీ 32వ వార్డు సిబ్బందిని వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వార్డు పారిశుధ్య పర్యవేక్షకుడు కాశీరావు, మేస్త్రీ జి.కనకరాజు, భారతి, ఝాన్సీపై శంకర్లను అభినందించారు. కార్యక్రమంలో శాలివాహన, ఆదిబాబు,యాదగిరి శ్రీను, కందుల కేదార్నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ఘనంగా నివాళి



అక్కయ్యపాలెంలో విశ్వకర్మ, ప్రధాని నరేంద్ర మోదీల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 17: జిల్లా కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాస్తు శిల్పిగా పేరుగాంచిన విశ్వకర్మ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డీఆర్వో మోహనకుమార్, అధికారులు శ్రీదేవి : అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగోవింద్ సింగ్, ఆచారి ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేన్యూకాలనీలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పృధ్విరాజు, బీజేపీ సాలూరు ఇన్‌చార్జ్ ఎస్వీ ప్రకాష్‌రెడ్డి, రత్నం, పార్వతి, వెంకటరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'మహిళలపై నీచ రాతలను ఖండిస్తున్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

మహారాణిపేట, సెప్టెంబరు 17: సినీనటి జెత్వానీకి జరిగిన అన్యాయంపై దేశ వ్యాప్తంగా మద్దతు తెలుపుతుంటే మాజీ సీఎం జగన్ రెడ్డి మాత్రం దోషులను కాపాడేందుకు సాక్షి పత్రికలో దిగజారుడు రాతలు రాయిస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జెత్వానీ కేసు సూత్రధారి జగన్‌రెడ్డే అని ఆరోపించారు. మహిళా అభ్యుదయం, సంక్షేమం, మహిళల భద్రత అంటూ గత ఐదేళ్ల ప్రచార ఆర్భాటాలు చేసిన జగన్ రెడ్డి తన సొంత పత్రికలో మహిళలను తీవ్రంగా అవమాన పరిచే లా వార్తలు రాయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. ఆయన సతీమణి భారతీ రెడ్డి ఆ పత్రికకు ఛైర్‌పర్సన్‌గా ఉండి సాటి మహిళను అవమానించటం సిగ్గుచేటన్నారు. నాయకురాళ్లు గనగళ్ల సత్యరామలక్ష్మి, శోభ, రాగిణి, వేణు, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు

మహారాణిపేట, సెప్టెంబరు17: జిల్లాలో సహజ తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, వాటికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరెట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి వనరుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చేపట్టిన సర్వేలో గుర్తించిన చెరువుల అభివృద్ధికి సంబంధించి వ్యయ అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు భవిష్యత్‌లో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని సూచించారు వనరుల సంరక్షణలో నివాసితులను, రైతులను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జేసీ మయూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

అక్కయ్యపాలెం, కంచరపాలెం, సీతంపేట, సెప్టెంబరు 13: నులి పురుగులతో శారీరక ఎదుగుదల, మానసిక అభివృద్ధి తగ్గుతుందని, అందుకే పిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం 46వ వార్డు శాంతినగర్ లక్ష్మీనారాయణపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం తర్పీపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సుభాష్‌నగర్, కప్పరాడ, కె.మర్రిపాలెం, కరాస తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీతంపేట మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ శ్రావణి, ప్రధానోపాధ్యాయలుడు శాంతికుమారి, దేముడు బాబు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారులు సోమేశ్వర్రావు, దివాకర్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

'వెల్ఫేర్ ఆఫీసర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారు'

సీతమ్మధార, సెప్టెంబరు 17: సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం నెంబర్ 2 వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావును అన్యాయంగా సస్పెండ్ చేశారని, దీనిని నవయానం బహుజన సంక్షేమ సంఘం తరఫున ఖండిస్తున్నామని సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతమ్మధార వసతి గృహంలో రెండేళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఆర్.ప్రసాదరావును ఉత్తమ అధికారిగా అవార్డు ఇచ్చాయని, ఎన్నో ప్రశంసా పత్రాలు, ప్రభుత్వం నుంచి అందుకున్నారని, ఇవి ఆయన పనితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థులపట్ల నిజాయతీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ తనపై కుట్రపూరితంగా పథకం ప్రకారమే ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ యు.నాగరాజు, ఎన్.శ్రీనులు ఇలా చేశారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోవడమే ఇందుకు కారణమన్నారు.

వంట నూనెలు సలసల...

5వ పేజీ తరువాయి

గత మూడు రోజులుగా విస్తృత ప్రచారం జరగడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా అన్ని జిల్లాల్లో స్టాకిస్టులు, డీలర్లు, రిటైలర్లపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చాలా జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. విశాఖలో మాత్రం మంగళవారం రాత్రి 8 గంటల వరకు విజిలెన్స్ అధికారుల నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదు. కొన్ని పెద్ద వ్యాపార సంస్థలకు ముందుగా సమాచారం వెళ్లిందో ఏమో చిత్రాలయ ఎదురుగా ఉన్న పెద్ద వ్యాపార సంస్థలో లీటరు రూ.112కే బోర్డులు పెట్టి విక్రయించారు. వంట నూనెల ధరలు పెరగలేదని, గతంలో రేటుకు మాత్రమే విక్రయించాలని ప్రచారం చేయాల్సిన అధికారులు మౌనంగా ఉన్నారు.

కేజీహెచ్‌లో నిలిచిన పీఆర్‌పీ ట్రీట్‌మెంట్!

... 5వ పేజీ తరువాయి

వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ వైద్య సేవలను ప్రారంభించేందుకు అదనంగా అయ్యే ఖర్చు కూడా ఉండదని, సిబ్బందిని మాత్రమే ఇందు కోసం కేటాయించాల్సి ఉంటుందని అంటున్నారు. దీనిపై కేజీహెచ్ ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సిటీ డయాగ్నో సెంటర్ ప్రారంభమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

భవన నిర్మాణం వ్యయం రూ.9 కోట్లు. ఈ భవనాన్ని రీజనల్ డ్రగ్ స్టోర్‌గా వినియోగించ నున్నారు. ఈ రెండింటినీ ఒకేసారి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రీజనల్ డ్రగ్ స్టోర్‌లో మందులు నిల్వ చేయనున్నారు. ఆరు నెలలకు సరిపడా మందులు, ఇంజెక్షన్లు వంటివి నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడి నుంచే ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు మందులను పంపిణీ చేయనున్నారు. అయితే సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభించాలంటే అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలి. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

చేతులు మారిన పర్యాటక ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. దీని కోసం ఒక ప్రైవేటు సంస్థకు 2.3 ఎకరాలు కేటాయించారు. వాస్తవానికి గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు ఎటువంటి భూములు కేటాయించకూడదు. పైగా దీనికి స్థానిక గ్రామసభ ఆమోదం కూడా లేదు. కేవలం ట్రయల్ రన్ నిర్వహిస్తారని గిరిజనులను నమ్మించి జిప్ లైన్ ప్రారంభించారు. దాదాపు తొమ్మిది నెలలు నడిపారు. జిప్‌లైన్ ఎక్కడానికి టికెట్ ధర రూ.500 పెట్టారు. అలా దాని ద్వారా ఆ సంస్థకు రూ.2.59 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో ఏపీటీడీసీకి రూ.65 లక్షలు మాత్రమే చెల్లించారు. దానిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో మూసేశారు. తాజాగా దీనిపై కూడా అల్లూరి జిల్లా అధికారులు ఆ గ్రామానికి వెళ్లి మంగళవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ట్రయల్ రన్ పేరుతో తొమ్మిది నెలలు నడిపారని, ఇక వారికి ఇవ్వద్దని అంతా డిమాండ్ చేశారు. స్థానిక యువకులతోనే ఒక సంస్థను ఏర్పాటుచేసి, దాని నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించాలని కోరారు.

వన్‌టౌన్‌లో హత్య

... 5వ పేజీ తరువాయి

చికిత్స పొందుతూ మంగళవారం రాము మరణించినట్టు సీఐ పేర్కొన్నారు. పాత కక్షలతో అతడిని దారుణంగా కత్తులతో పొడిచి చంపినట్లు తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. హతుడు తల, మెడ, పొట్ట భాగంలో కత్తిపోట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేశామన్నారు. ఈ హత్య వెనుక ప్రమేయం ఉన్న వారెవ్వరినీ వదిలేది లేదని సీఐ భాస్కర్ పేర్కొన్నారు.

వ్యభిచార నిర్వహణ ముఠా అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 17: మహిళల అక్రమరవాణా, వ్యభిచారం నిర్వహిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ డా శంఖబ్రత బాగ్చి మంగళవారం తెలిపారు. వెబ్‌డిజైనర్ అయిన రావాడ కామరాజు దీపక్ పేరుతో ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను సృష్టించి ఏజెంట్ల వివరాలు, మహిళల ఫొటోలను అందజేస్తూ కస్టమర్లు, ఏజెంట్లకు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు దాడి చేసి లాసెన్స్ బే కాలనీలోని ఒక ఇంటిలో ఉంటున్న కామరాజును అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఉన్న సహచరులు బాడ రాము, మాటూరు రమేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం వారి ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో జరిపిన విచారణలో మహిళలను ఈ ఊబిలోకి లాగేందుకు ఉపయోగించుకున్న 34 మంది ఏజెంట్ల పేర్లు వెల్లడించారు. వారు ఇచ్చిన సమాచారంతో ముగ్గురు బాధితులను రక్షించి ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తిరుపతికి బెర్తులా.. ఖాళీల్లేవు!

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌కు (17487) కూడా నవంబరు నెలాఖరు వరకు దాదాపు బెర్తులు నిండిపోయాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు నవంబరు 24 వరకు ఫుల్

విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (22879) నవంబరు 23 వరకు, ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైళ్లకు నవంబరు 30, 31 తేదీల నుంచి బెర్తులు ఖాళీ ఉన్నాయి.

ప్రత్యేక రైలుకు అందుబాటులో బెర్తులు

ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతి వెళ్లే ప్రత్యేక రైలు (08583)లో బెర్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు అక్టోబరు నెలలో కూడా ప్రతి సోమవారం బెర్తులు ఉన్నాయి. తిరుమల ఎక్స్‌ప్రెస్, ఇతర రైళ్లలో బెర్తులు లభించని వారు ప్రత్యేక రైళ్లను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది.

రోజువారీ, వారాంతపు రైళ్లకు డిమాండ్

ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచే రోజువారీ, వారాంతపు రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు డిమాండ్ ఉంది. హౌరా-బెంగళూరు రోజువారీ ఎక్స్‌ప్రెస్ (12863)కు నవంబరు 21 వరకు కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ మినహా బెర్తులు నిండిపోయాయి. పూరి-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), సంత్రాగచ్ఛి-మంగుళూరు (22851), హటియా-బెంగళూరు (12835), వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504), అంగా ఎక్స్‌ప్రెస్ (12254), గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) వంటి రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకూ డిమాండ్ నెలకొంది.

విశాఖ-తిరుపతి మధ్య మరో రైలుకు డిమాండ్

విశాఖ-తిరుపతి మధ్య ప్రతిరోజు నడిచేలా శాశ్వత ప్రాతిపదికన మరో రైలు ప్రవేశపెట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే అధికారులు దానిపై దృష్టి పెడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన రోజువారీ సర్వీసుల రూపంలో కొత్త రైలు ప్రవేశపెట్టాలని, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరద బాధితులకు ఏయూ రిటైర్డ్ టీచర్స్ సొసైటీ విరాళం


ఏయూ రిజిస్ట్రార్‌కు చెక్కు ఇస్తున్న సొసైటీ సభ్యులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 17: ఏయూ రిటైర్డ్ టీచర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు విజయవాడవరద బాధితులకు సాయమందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావును కలిసి రూ.1,01,116 చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ఎల్.డి.సుధాకరబాబు, కైలాసరెడ్డి, జి.వి.వి.జయకుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

తగరపువలస: విజయవాడలోని వరద బాధితులకు దాతల నుంచి సేకరించిన దుస్తులు, నిత్యావసర సరకులను మంగళవారం పంపిణీ చేసినట్టు టీడీపీ నాయకుడు వి.సత్యనారాయణ తెలిపారు. నాయకులు, తెలుగు యువత ప్రతినిధులు వెళ్లి విజయవాడలోని 250 కుటుంబాలకు దుప్పట్లు, తువ్వాళ్లు, సరకులు పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగవంశ నాయకులు పాల్గొన్నారు.

గణపతి మండపం వద్ద అన్నదానం

పద్మనాభం(రూరల్), సెప్టెంబరు 17: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన అన్నసమారాధనను ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు కాళ్ల నగేష్‌కుమార్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. అన్నదానానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బి.వెంకటరావు, కనకల సన్యాసినాయుడు, ఎం.సన్నిబాబు, గిరి. సన్యాసినాయుడు. తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబును విమర్శిస్తే సహించం'

వెంకోజీపాలెం/ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 17: విశాఖ లోని ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టిన ఘనుడు వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ప్రణవ్‌గోపాల్ మంగళవారం ట్విట్టర్‌లో విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. సముద్ర తీరాన్ని, బినామీలతో ముడసర్లోవను సాయిరెడ్డి కబ్జా చేశారన్నారు. చంద్రబాబుపై ప్రేలాపనలు మానుకోవాలని, మరోసారి విమర్శలు చేస్తే విశాఖలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు.

పద్మశాలీ సంఘ కోకన్వీనర్‌గా రమేశ్

తగరపువలస: పద్మశాలీ సంఘం రాష్ట్ర కో కన్వీనర్‌గా కొప్పల రమేశ్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన సమావేశంలో రమేశ్‌ను సంఘ ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం పలువురు అభినందించారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ పూజల్లో వెలగపూడి సుజన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 32, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 110, బరబాటి 42, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 74, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మోదీ నాయకత్వంలో అగ్రరాజ్యాల సరసన భారత్

▸▸ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, సెప్టెంబరు 17: భారత్‌ను అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం పురోభివృద్ధి సాధిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మోదీ ఆలో చననుంచి వచ్చిన స్వచ్ఛభారత్‌ను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలునిచ్చారు. మోదీ పుట్టిన రోజు సందర్భంగా సాగర్‌నగర్ బీచ్‌లో జీవీ ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చునని తెలిపారు. మోదీ వల్లే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రాచుర్యం లభించిందన్నారు.

విశాఖ-భోగాపురం బీచ్ అభివృద్ధికి ప్రణాళిక

విశాఖ-భోగాపురం మధ్య 45 కిలోమీటర్లు బీచ్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. బీచ్‌లోఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, చిల్డ్రన్ ప్లే ఏరియాలు, ఈటర్స్ జోన్స్ తదితరాలను త్వరలోనే కార్యరూపంలోకి తీసుకురానున్నట్టు వివరించారు. విజయవాడ వరదల్లో 11 రోజుల పాటు ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసిన 250 మంది జీవీఎంసీ పారిశుధ్య సిబ్బం ది నిజమైన హీరోలుగా అభివర్ణించారు. వారందరిని గంటా సత్కరించారు. అనంతరం బీచ్‌లో శుభ్రత చేపట్టారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శైల జావల్లి, కార్పొరేటర్ నొడగల అప్పారావు, కోరాడ రాజబాబు, చెట్టుపల్లి గోపి, పంచకర్ల సందీప్, శాఖరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పండ్లు, రొట్టెలు పంపిణీ

భీమునిపట్నం: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ 3వ వార్డు అధ్యక్షురాలు కంటుభుక్త సునీత స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంటుభుక్త రామానాయుడు, పోలుబోతు విజయ, జొన్నలగడ్డ సాయి ప్రవీణ్, ఆకుల భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ఆర్డీఓ

పద్మనాభం: బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గాయత్రి కల్చరల్ యూత్ అకాడమీ,రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలకు పుస్తకాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు రూపాకుల రవికుమార్, తహసీల్దార్ ఆనందకుమార్, డీటీ నియోగ్, ఆర్ఐ కోటి, నారాయణరాజుపేట సర్పంచ్ సూర్యనారాయణ, మజ్జిపేట ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు శ్రీనివాస్, కృష్ణారావు, మహేష్, పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో

పెదవాల్తేరు: ప్రధాని మోదీ జన్మదినోత్సం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అధ్వర్యంలో పెదవాల్తేరు మానసిక దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించారు. దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటుచేశారు. అనంతరం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కండిపిల్లి శ్రీనివాసరావు, సురేష్ కుమార్, రాజు, అప్పారావు, పద్మావతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే ప్రజలకు మేలు

పెదవాల్తేరు: ప్రధాని మోదీ పాలనలో ప్రజలకు మేలు చేకూరుతుందని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. నగర బీజేపీ కార్యాలయంలో మోదీ జన్మదినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా రూ.20 వేల కోట్లతో 9.3 కోట్లమంది రైతులను ఆదుకున్నారన్నారు. ఆవాస్ యోజన ద్వారా 4.27 కోట్ల ఇళ్లను మంజూరు చేశారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తిరుపతి ఎంపీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సాగి కాశీవిశ్వనాథరాజు, ప్రకాష్, విజయానందరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మహిళా కండక్టర్లపై వేధింపులు ఆపాలి'


మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 17: మహిళా కండక్టర్లపై వేధింపులు ఆపాలని ఎన్ఎంయూ స్థానిక డిపో అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు మంగళవారం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణకుమారి, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, మరో అధికారి అశ్విని మహిళలై తోటి మహిళా కండక్టర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. టెర్మినల్ వద్ద బాత్‌రూమ్‌లు లేక సులాబ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్న మహిళా ఉద్యోగులకు జరిమానా విధించడం దారుణమన్నారు. కార్య క్రమంలో జోనల్ సహాయ కార్యదర్శి సి.హెచ్. ఈశ్వరరావు, నాయకులు శివాజీ, నీలకంఠం, బంగారయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు


పోడియం తొలగించిన అనంతరం భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భీమునిపట్నం, సెప్టెంబరు 17: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ వేదిక వద్ద ఉన్న పోడియంను మంగళవారం తొలగించారు. ప్రజలు, అధికారుల మధ్య అంతరం తొలగించేలా రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశాలమేరకు చర్యలు తీసుకున్నారు. బ్రిటిష్ కాలం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం ఉండేది. అధికారులను ప్రజలకు మరింత చేరువచేయాలనే ఉద్దేశంతో పాతకాలం నాటి ఈ విధానానికి వీడ్కోలు పలకాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంను సిబ్బంది తొలగించారు. దీంతో కార్యాలయానికి పలు పనులపై వచ్చిన వారు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి దుర్గమాంబ ఆలయంలో చండీ సహిత సుదర్శన యాగం

ఆరిలోవ, సెప్టెంబరు 17: లోక కల్యాణార్థం చండీ సహిత సుదర్శనయాగాన్ని ఈనెల 18 నుంచి తోటగరువు దుర్గమాంబ ఆలయంలో నిర్వహించనున్నట్టు బాలభాను అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు జోష్యుల కామేశ్వరశర్మ తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలన వెల్లడించారు. బుధవారం నుంచి ఐదు రోజుల పాటు యాగం నిర్వహిస్తామన్నారు. రోజూ పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. భక్తుల భాగస్వామ్యంతో రాత్రి ఏడు గంటల నుంచి సీతారాముల కల్యాణం, వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, శివపార్వతులు, శ్రీనివాసుడు, సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలు సహస్రాధిక దేవాలయ ప్రతిష్ఠాపకులు రామాచార్లు ఆధ్వర్యంలో జరుగుతాయని వివరించారు. ఆలయ కార్యదర్శి కిశోర్‌కుమార్ శర్మ మాట్లాడుతూ యాగానికి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు అరవెల్లి సూర్యప్రకాశ్, కోశాధికారి పి. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు మురపాక కృష్ణమూర్తిశర్మ, మావుడూరి సంపత్‌కుమార్ శర్మ, కన్యకాపరమేశ్వరి ప్రధానార్చకులు బీఆర్ కుమార్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పురోహిత సంఘం ప్రతినిధులు

నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ

ఆనందపురం, సెప్టెంబరు 17: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 16,610 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలలకు రాని విద్యార్థులకు ఈ నెల 25న మాత్రలు అందిస్తాని వైద్య సిబ్బంది తెలిపారు. వేములవలసలో ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ విద్యార్థులకు మాత్రలు వేశారు. ఆరోగ్య సిబ్బంది చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

వెంకోజీపాలెం: ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, అంబేద్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈర్ల దేవి, ఆశవర్కర్లు చిన్నతల్లి, మంగ తదితరులు పాల్గొన్నారు.

5,617మందికి ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ

పద్మనాభం: డీవార్మింగ్ డే పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో 5,617మంది పిల్లలకు మంగళవారం ఆల్బెండాజోల్ మాత్రలను వేశారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న ఆధ్వర్యంలో 75 మంది ఉద్యోగులు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో చిన్నారులకు నులి పురుగుల నివారణకు ఈ మాత్రలు వేశారు. పొట్నూరులో జరిగిన కార్యక్రమంలో ఈఓఆర్డీ కుమార్, మాజీ సర్పంచ్ బేపల గురునాయుడు, కార్యదర్శి పైడియ్య ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

సందడిగా టీఎస్సార్ జన్మదిన వేడుకలు


రాజ్యసభ సభ్యుడు బాబూరావుకు కేకు తినిపిస్తున్న నేతలు

సిరిపురం, సెప్టెంబరు 17: కేంద్ర మాజీ మంత్రి డా.టి.సుబ్బరామిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిరిపురంలోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి కేంద్ర మంత్రిగా విశేష సేవలను అందించారని కొనియాడారు. సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్సార్ కార్యదర్శి ఎస్కే బాషా, ఐఎన్‌టీయూసీ నేత మంత్రి రాజశేఖర్, వైసీపీ నాయకుడు దల్లి రామకృష్ణారెడ్డి, పిన్నింటి ఆదిబాబు, టీఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు కృషిచేయాలి

ఆనందపురం, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్లంకి గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం అధికారులు, ప్రజల భాగస్వామితో నిరంతరం జరగాలని చెప్పారు. ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మొక్కలు నాటారు. పలు పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో లవరాజు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

పద్మనాభం(రూరల్): స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎం.వి జయకుమార్ కోరారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో సమావేశం న్విహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంపీఎం ప్రభాకర్, ఈవోపీఆర్డీ కుమార్, టీడీపీ నాయకులు కోరాడ రమణ, కె.దామోదరరావు, గెద్ద ప్రసాద్, పీవీ రమణ, రొబ్బి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్): కృష్ణంరాజుపేటలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం అవగాహనకు మానవహారం నిర్వహించారు. స్థానిక పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. తాళ్లవలసలో ఎంపీడీవో జానకి మొక్కలను నాటారు. పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. మండల ఇంజనీరింగ్ అధికారి పట్నాయక్, ఈవోపీఆర్డీ అప్పలరాజు, వీఆర్వో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ నాయకులు డీఏఎస్ రాజు, ఉపసర్పంచి రాజు, ఎంపీటీసీ సభ్యుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.విజయకుమార్ పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఆనందకుమార్, ఈఓఆర్డీ కుమార్, ఏపీఎం ప్రభాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ నాయకుడు రమణ, ఇతర నాయకులు ప్రసాద్ శ్రీను, వెంకటరమణ పాల్గొన్నారు.


కృష్ణంరాజుపేటలో విద్యార్థుల మానవహారం

సింహాచలంలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం


పవిత్రాలతో గోవిందరాజస్వామి

సింహాచలం, సెప్టెంబరు 17: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 13న అంకురార్పణతో ప్రారంభమైన వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం జరిగిన ఏ కాంత స్నపన తిరుమంజనంతో పరిసమాప్తమయ్యాయి. దానిలో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. తర్వాత అంతరాలయంలో ఏకాంతంగా పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో పంచామృతాలతో, పవిత్ర గంగధార జలాలతో స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. ఆలయ పండితులు చతుర్వేదాలను పఠనం చేశారు. తాత్కాలికంగా నిలిపివేసిన అర్జిత సేవ లు ఈనెల 18 నుంచి యథావిధిగా పారంభం కానున్నాయి.

వెంకటేశ్వరస్వామికి సీఎంఆర్ అధినేత పూజలు


సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణకు చిత్రపటం ఇస్తున్న ఆలయ మేనేజర్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 17: ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ బి.సన్యాసిరావు ఆయనకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. అర్చకులు వెంకటాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, సెప్టెంబరు 17: కొమ్మాది జంక్షన్‌లోని భగవాన్ విశ్వకర్మ ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మధురవాడ కార్పెంటర్స్ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ఎంపీ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత, నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, 5 6 8 వార్డుల అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్,శెట్టిపల్లి గోపి, ఈగల రవి, గరే గురునాథ్, కొండపురాజు, మధురవాడ కార్పెంటర్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవ: ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, గోడి నరిసింహాచార్యులు, పి.ధర్మారావు, సురేష్, రమణి, జి. భాస్కరరావు, శ్రీనివాస్, రవికుమార్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

పద్మనాభం, సెప్టెంబరు 17: మండలంలోని పొట్నూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయిని వి.చిన్నారి ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ పి. రమణ, రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం సన్యాసిరావు ప్రారంభించారు. విద్యార్థులు భక్త మీరాబాయి వేషధారణతోపాటు పలు సాంస్కృతి ప్రదర్శనలతో అలరించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు, విద్యా కమిటీ చైర్మన్ దేవి, స్థానిక నాయకులు నందీశ్వరరావు, గురునాయుడు, బంగారునాయుడు, శ్రీను, ఆపస్ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎస్టీయూ నాయకులు జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి జనంపైకి దూసుకువచ్చిన మినీ వ్యాన్

▸▸ ఇద్దరికి గాయాలు, ఓ ద్విచక్రవాహనం ధ్వంసం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయిన మినీ వ్యాన్

గోపాలపట్నం, సెప్టెంబరు 17: అదుపు తప్పిన మినీ వ్యాన్ జనాలపైకి దూసుకువచ్చిన ఘటనలో ఇద్దరికి గాయాలవడంతో పాటు ఓ ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో చంద్రనగర్ నుంచి ఎల్లపువానిపాలెం వైపు వస్తున్న ఓ మినీ వ్యాన్ అదుపు తప్పి ఎల్లపువానిపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద జనాలపైకి దూసుకువచ్చింది. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాల తొక్కుకుంటూ సమీపంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొని ఆగింది. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు స్థానికులు భయాందోళనతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకపోయినా, ఓ మహిళకు, ఒక ద్విచక్ర వాహనదారునికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు కారణమైన మినీ వ్యాన్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మినీ వ్యాన్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'భవన నిర్మాణ కార్మికులకు బీమాతో మేలు'

భీమునిపట్నం, సెప్టెంబరు 17: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం పురస్కరించుకుని భవన నిర్మాణ రంగ కార్మికులకు బీమా అమలు గొప్ప ఆలోచని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. జిల్లా ధార్మిక మండలి కన్వీనర్ సత్తరవు వాయునందనరావు మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీవరకు కార్మికులను నమోదు చేస్తామన్నారు. బీమా ప్రీమియంను ఐదేళ్లకు ధార్మిక మండలి చెల్లిస్తుందన్నారు. భరత్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

డెంకాడ, సెప్టెంబరు 17: విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరానికి చెందిన ఎన్.మనోజ్‌కుమార్ (30), విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం ఆర్.తాళ్లవలసకు చెందిన ఎ.శ్యాంప్రసాద్ (31) మృతిచెందారు. డెంకాడ ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాల మేరకు విశాఖ నుంచి కారులో వస్తున్న స్నేహితులుఎన్.మనోజ్‌కుమార్, ఎ.శ్యాంప్రసాద్ మోదవలస సమీపానికి వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరు మూడు రోజుల క్రితం స్నేహితులతో కలిసి తిరుపతి వెళ్లారు. తిరుగుప్రయాణంలో కొందరు తమతమ ప్రాంతాల్లో దిగి ఇళ్లకు వెళ్తున్నారు. విజయనగరం వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మనోజ్‌కుమార్ కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.